"ఆనికి తెల్సిందా?"

లాలయ్య కిసకిస న వ్వాండు.

"తెల్సిందట. కొడుకును వోరకు పిలిసి మీ అయ్య పిసినారి. నువ్వు సిల్లర సల్లుతంటె అగో పది పైసలబిళ్ళ కిందబడ్డది. మరందేచేత మీ అయ్య కదలనంటండు ఆ బిళ్ళ తీసి పాడెమీదేయి. బరువు తగ్గుతడు అన్నడట."

"ఓ ర్నీ యమ్మ...." షావుకారి లాలయ్య.

"కొడుకు అట్లా చేసిండట- పీనుగు ఈసారి అలుకగ లేసిందట" ఆపుకోలేక చిటికేస్తూ లాలయ్య.

"ఓ బీడియ్య షావుకోర్" అన్నాడు.

"ముండకొడుక వట్టూ" అని మాసిన ముతక బనీను జేబులోనుండి బీడీ తీసి లాలయ్య కిచ్చిండు పాలయ్య. ★




పి. రాజేంద్ర ప్రసాద్

అప్పట్లో అందరూ అన్నారు - "ధనంజయ్ తెలివిగలవాడు, బుద్ధిమంతుడు, విద్యావంతుడు. సరస్వతి వాడి నోటిపై నివాసముంది. తప్పకుండా పైకొస్తాడు" అని. అతను స్కూల్ ఫస్టు—ఫస్టు ఫాం నుంచి, స్కూల్ ఫైనల్ వరకూ — వాడి ధాటికెదురు నిల్చే విద్యార్థిలేడు, వాణ్ణి అభిమానించని టీచరూ లేడు. హెడ్ మాష్టరు సైతం ఎవరినైనా చీవాట్లు వేసేప్పుడు. ఆఖరికి కన్నకొడుకుకైనాసరే - తిట్టిపోసేప్పుడు "ఆ ధనంజయ్‌ని చూసైనా బుద్ధి తెచ్చుకోండిరా, ఎందుకురా మీకు చదువు" అంటూ మొదలుపెట్టేవారు. ప్రతి విషయంలోనూ ధనంజయ్‌ను గొప్పగా పొగిడేవారు.

ధనుంజయ్ ఫిఫ్త్‌ఫాంలో వుండగా, ఒక ఇంగ్లీషు టీచరు సుబ్బారావుగారు వెంకట్రావును కేకలేస్తూ "ఎందుకు పనికొస్తావురా నీవు? రేపు ఏదైనా హోటల్లో కప్పులు కడగాల్సిందే. అందుకూడా పనికిరావురా. ఆ ధనంజయ్ చూడు ఇంగ్లీషులో 96% తెచ్చుకున్నాడు. వాడి చెంతనాకి బుద్ధి తెచ్చుకో. ఈ స్కూల్ పరువు, నా పేరు నిలబెట్టేది వాడేరా రేపు" అన్నారు. ఆ రోజేకాదు ప్రతిరోజూ యిలాంటి పొగడ్తలు ఎన్నో విన్నారు అప్పటి విద్యార్థులు. ధనంజయ్‌పై అసూయ పడని విద్యార్థి లేడంటే అతిశయోక్తి కాదు.

ధనంజయ్ సెవెంత్ ఫారంలో ఉండగా లెక్కల టీచర్ పాల్‌గారు అసలేమాత్రం లెక్కలురాని హరప్రసాద్ సింగును తిడుతూ — "ఛీ, ఛీ! మీకెన్నిసార్లు చెప్పాలిరా. లెక్కల్లో మార్కులు నూటికి పదా? సిగ్గులేదూ? వాణ్ని చూడండి నూటికి నూరు. అలా, ఆ ధనంజయ్‌కు ఎలాగొస్తున్నాయ్? దీనికి కారణం పట్టుదల, కృషి, అవి మీ దగ్గరెక్కడేడ్చాయి. హాఫియర్లీ మార్కులిలా తగలబడితే, రేపు పబ్లిక్ ఎలా గీకుతార్రా మీరు? మీరందరూ ఏ లారీలో తోల్తూఉంటే, వాడు, ఆ ధనంజయ్ మాత్రం ఏ జిల్లా కలెక్టరో, పోలీసాఫీసరో, యింజనీరో అయి, దివ్యంగా వెలిగిపోతుంటాడు. వాడి కాళ్ళు కడిగి, ఆ నీళ్ళు నెత్తినేసుకోండి" అంటూ ముగించారు.

సైన్సు మాష్టరు ప్రతిరోజూ, ప్రతి క్లాసులోనూ ధనంజయ్‌ను మెచ్చుకునేవారు. ఆయన ఒకనాడు సైన్సు ఎగ్జిబిషన్‌లో "మన స్కూలు పేరు నిలబెట్టడానికి ధనంజయ్‌లాంటి విద్యార్థి ఒకడు చాలు. వాడు పెద్ద సైంటిస్టయ్ నోబెల్ బహుమతి గ్రహీతైనా ఆశ్చర్యపోనవసరంలేదు. అయాం ప్రౌడాఫ్ హిం" అన్నారు. స్కూల్ ఫస్టు వచ్చిన ధనంజయ్ కాలేజీలో చేరాడు. బి.యెస్సి. యూనివర్సిటీ ఫస్టొస్తాడనుకున్నారు అందరూ. కానీ, అలా జరగలేదుకానీ, ఫస్టుక్లాసులో పాసయ్యాడు.

ఉద్యోగాన్వేషణలో రెండు సంవత్సరాలు గడిపాడు. కనీసం ఏ చిన్న గుమాస్తా ఉద్యోగమైనాసరే చెయ్యడానికి సిద్ధంగా ఉన్నాడిప్పుడు. ఆనాటి పొగడ్తలు ఈనాడు జ్ఞాపకం తెచ్చుకుంటే—అతని వంటిపై తేళ్లు, జెర్రులూ పాకినట్లు వుంటుంది అతనికిపుడు! ఆనాడు తన టీచర్లందరూ వాంఛించిందేమిటి? ఈనాడు తన విషయంలో జరుగుతోందేమిటి?

అంతేకాదు, మొన్న యేదో యింటర్వ్యూకి వెళ్ళిన తను ఆశ్చర్యపోయేలా తెలిసిన విషయం - ఆ కంపెనీ మానేజర్ ఆనాటి తనతోటి విద్యార్థి హరప్రసాద్ సింగ్, అందుకే అతనికా ఉద్యోగం రాలేదు. నిత్యమూ హైస్కూల్లో టీచర్ల చివాట్లను తినేటి వెంకట్రావ్ పెద్ద ఆఫీసర్ ఓ బ్యాంకులో. తన బెంచీలో అత్తెసరు మార్కులతో పాసైన అక్బర్ యిపుడు పెద్ద కాంట్రాక్టరై వేలుసంపాదిస్తున్నాడు- మరి తను? - చిన్న గుమాస్తా ఉద్యోగం కూడా సంపాదించలేని నిస్సహాయుడు. చిన్నప్పుడు టీచర్లు మెచ్చుకున్న తెలివి తెలివేకాదని యిప్పుడు తెలిసొచ్చింది. ❁

## బాల గోపాలం



కూర్చుంటే పిలుస్తుంది

ఎక్కాలకు సుమిత్ర

## "అవియల్"

కేరెట్ — 2 దుంపలు. వంకాయలు — 3. బూడిదగుమ్మడి — 1/8 ముక్క- ఇష్టమైన కూరలు (గోరుచిక్కుడు, బటానీ, Beans Etc)

పై కూరలు సన్నగా పొడవుగా ముక్కలు తరిగి ఉడికించి వుంచవలెను. వీటికి సరిపడే పచ్చిమిర్చి, ఒక చెంచా జీలకర్ర, ఉప్పు, చిటికెడు పసుపు మెత్తగా నూరి చిన్న గిన్నెలో ఈ ముద్దను వుంచుకోవలెను. పచ్చికొబ్బరి చిప్ప కోరి రెండు కప్పుల పెరుగులో కాస్త ఉప్పువేసి వుంచవలెను. వెడల్పు గిన్నెలో అరు చెంచాలు నెయ్యి వేసి వేగాక ఆవాలు, కరివేపాకు. కూర ముక్కలు, మసాలా ముద్దవేసినాలుగు నిమిషాలు మూతపెట్టి మగ్గనివ్వాలి. అప్పుడు పెరుగుపోసి కుదిపి దించి మూతపెట్టుకోవలెను. ఇది అన్నములోకి రుచికరమైన ఆధరువు. అంతే కాక చపాతీ, పూరీలలో నంజుకోడానికి రుచిగా వుంటుంది.

ఏ. అరుంధతీరావు; ఏలూరు